## కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

దుకాణాలు, సంస్థల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం కార్యాలయంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రకారంగా ఆన్‌లైన్‌లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చిన దుకాణం, సంస్థలను తనిఖీ చేసి అందులో పనిచేసిన 13 మంది కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం తక్కువ వేతనాలు చెల్లిస్తున్నట్లు తనిఖీ సమయంలో కనుగొన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత యజమానుల నుంచి తేడాగా ఉన్న రూ.92,874 వేతనాన్ని డిడిల రూపంలో చెల్లించినట్లు తెలిపారు.

వేతనం తేడా డిడిలు అందజేస్తున్న దినేష్ కుమార్

# బిల్లులకు అనుగ్రహమెప్పుడో..?

వారంతా గత టిడిపి ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ లబ్ధిదారులు. ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఇళ్ల నిర్మాణాలూ ప్రారంభించారు. వారిలో కొందరికి మొదటి విడత వరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోయినా, ఎప్పటికైనా డబ్బులు వస్తాయన్న నమ్మకంతో అప్పో సప్పో చేసి ఇళ్లు కట్టుకున్నారు. కొందరికి అప్పు పుట్టకపోవడంతో మధ్యలోనే ఇళ్లను ఆపేశారు. ఇళ్లు నిర్మించి ఆరేడు సంవత్సరాలు కావస్తున్నా, బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను చవిచూస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు సర్వే చేసినా డబ్బులు మాత్రం జమ చేయలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరులో తాజాగా సర్వే చేపట్టారు. దీంతో ఇళ్ల బిల్లులు వస్తాయని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

బిల్లుల కోసం ఎదురుచూస్తున్న రామలక్ష్మి

- ఎన్‌టిఆర్ గృహ పథకం కింద లక్షలాది మందికి ఇళ్లు
- వైసిపి ప్రభుత్వ హయాంలో రెండుసార్లు సర్వే
- గతేడాది సెప్టెంబరులో మూడోసారి తనిఖీ
- రూ.50.33 కోట్లు పెండింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లావ్యాప్తంగా 2014-19 కాలంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద సుమారు నాలుగు లక్షల మందికి మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బిసిలకు రూ.1.50 లక్షలతో స్కీమ్ ఒకటి కాగా, మరొకటి ఎస్‌సిలకు రూ.రెండు లక్షల పథకం. వాటిలో ఇళ్లు మంజూరై ఒక్క పైసా రాని వారు, కొంతమేర సొమ్ములు వచ్చిన వారూ ఉన్నారు. ఇళ్లు పూర్తయిన వాటికి బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడం, అప్పటికి ఇంకా ఎవరూ ఇళ్లను పూర్తి చేయలేకపోవడంతో, లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. దీంతో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా తమ సొంత డబ్బులతో పునాదులు, రూఫ్ లెవల్ పనుల వరకు చేపట్టారు. తమ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఉన్నపళంగా ఇంటి నిర్మాణ పనులు ఆపేశారు. కొందరికి పునాదులకు రూ.10 వేలు, 15 సిమెంట్ బస్తాలూ ఇచ్చారు. వారు పునాదులు వేసి వదిలేశారు. బిల్లుల కోసం ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రెండుసార్లు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబరు వరకు నాలుగు నెలల పాటు సర్వే చేశారు. సర్వేలో గుర్తించిన లబ్ధిదారులు, వారికి చెల్లించాల్సిన నగదు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ప్రకారం జిల్లాలో రూ.50.35 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి.

### రెండు పర్యాయాలు వెరిఫికేషన్

టిడిపి హయాంలో మంజూరైన ఇళ్లకు బిల్లులు చెల్లించేందుకు తొలుత వైసిపి ప్రభుత్వం నిరాకరించింది. లబ్ధిదారుల నుంచి ఒత్తిళ్లు, ప్రజాప్రతినిధుల వినతులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం... బిల్లులు చెల్లించేందుకు అంగీకరించింది. టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించింది. అర్హులను గుర్తించేందుకు 2022 డిసెంబరులో గృహనిర్మాణ శాఖ సిబ్బంది, గ్రామ, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సర్వే చేయించింది. వారంతా అర్హులేనని అధికారులు నిర్ధారించారు. గతేడాది జూన్‌లోనూ మరోసారి పరిశీలించారు. అందులోనూ వారు అర్హులేనని తేల్చారు. సర్వేలు చేసినా లబ్ధిదారులకు డబ్బులు మాత్రం చెల్లించలేదు.

### ముచ్చటగా మూడోసారి తనిఖీ

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత మూడోసారి ఇళ్ల తనిఖీ ప్రక్రియను చేపట్టింది. గతేడాది సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు గ్రామాల్లో ఈ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాకు సంబంధించి లబ్ధిదారుల వివరాలు, వాటికి సంబంధించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన చెల్లిస్తామని చెప్పినా, ఇప్పటివరకు నగదు జమ చేయలేదు.

### ఇల్లు కట్టి అప్పుల పాలయ్యాం

మాకు 2016లో ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అప్పట్లో ప్రభుత్వం రూ.రెండు లక్షలు ఇస్తామని చెప్పింది. రెండు విడతల్లో రూ.1.27 లక్షలు మాత్రమే ఇచ్చింది. ఇప్పటికీ మిగిలిన రూ.73 వేలు చెల్లించలేదు. ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షల వరకు అప్పు చేశాం. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

**- పి.రాజులు, తుడ్డలి, బూర్జ మండలం**

### బిల్లులు వెంటనే చెలించాలి

మాకు 2015లో ఇల్లు మంజూరైంది. ఇప్పటివరకు రూ.92 వేలు మాత్రమే ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి డబ్బులు చాలక అప్పు చేశాను. వ్యవసాయ, భవన నిర్మాణ కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తే కొంత సాయంగా ఉంటుంది.

**- కుప్పిలి రామలక్ష్మి, డొంకలపర్త, బూర్జ**

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

# ప్రజారోగ్యంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- ఎన్‌టిఆర్ వైద్యసేవ నిర్వీర్యం
- సేవలందక రోగుల ఇబ్బందులు
- తక్షణం పునరుద్ధరించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజారోగ్యంపై టిడిపి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు విమర్శించారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రజల సంక్షేమం కోసం గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ప్రజలకు వైద్య సేవలను ఎందుకు నిలిపివేసిందని ప్రశ్నించారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నెల రోజులుగా ఎన్‌టిఆర్ వైద్యసేవ సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేయడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్యమందక ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందన్నారు. ఈనెల పదో తేదీ నుంచి ఎన్‌టిఆర్ వైద్యసేవ అన్ని ఎమర్జెన్సీ సేవలు నిలిపివేయడంతో కార్డియాలజీ, న్యూరాలజీ బ్రెయిన్ స్ట్రోక్, ప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లాలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడం, పేదలు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోలేక విశాఖ కెజిహెచ్‌కు తరలించే లోపే ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీ వైద్యం కోసం ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వెళ్లాలంటే 250 కిలోమీటర్లు ప్రయాణం చేయాలని, అనారోగ్యంతో ఉన్న వ్యక్తి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ ద్వారా 3,200 జబ్బులకు రాష్ట్రంలో రోజుకు సుమారు తొమ్మిది వేల ప్రీ ఆథరైజేషన్ ఉండేవని, మన జిల్లాలో 250 ఉండేవని తెలిపారు. ఆరోగ్యశ్రీ చరిత్రలోనే ఇన్ని రోజులు సేవలు నిలిచిపోవడం ఇదే తొలిసారి అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.వేల కోట్లు ధారాదత్తం చేసి మరోవైపు ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గూగుల్‌కి రూ.22 వేల కోట్లు ఇచ్చిందని, వైద్యానికి డబ్బులు ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ సేవలు పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## నిర్మాణ డిజైన్ పక్కాగా ఉండాలి

**శ్రీకాకుళం సిటీ:** మరుగుదొడ్డి నిర్మాణంలో డిజైన్ మెరుగ్గా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద నిర్మిస్తున్న పింక్ టాయిలెట్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. రోడ్డు పక్క నిర్మించే ర్యాంపు నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మరుగుదొడ్లకు వచ్చే మహిళలకు పరిశుభ్రతపై పలు సూచనలు చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లలో ఏర్పాటు చేసిన సీలింగ్, నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

# ఎండల మల్లన్న ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి రూ.ఐదు కోట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయం వద్ద కార్తీక మహోత్సవాల ఏర్పాట్లు, ఆలయ అభివృద్ధిపై అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రతిష్టను పెంపొందించే విధంగా ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్తీక పర్వదినాల సందర్భంగా యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్ల ఏర్పాట్లు, భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రశాంతంగా యాత్రికులు దర్శించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే రహదారులు, విద్యుద్దీకరణ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డిఎస్‌పి లక్ష్మణరావు, కోటబొమ్మాళి ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరిరావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ రేణుక తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**కోటబొమ్మాళి:** ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ... అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతులు అందాయి. నూతన ఫించన్లు, గృహాలు మంజూరు చేయాలని ప్రజల నుంచి పెద్దఎత్తున వినతులు అందుతున్నాయి. త్వరలో మంజూరు చేస్తామని హామీనిచ్చారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎఎంసి చైర్మన్ బగాది శేషగిరి, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల విజయలక్ష్మి, టిడిపి నాయకులు వెలమల కామేశ్వరరావు, నంబాళ శ్రీనివాస్, పినకాన అజయ్‌కుమార్, బోయిన సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సమస్యను పరిష్కరించాలి

### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగర కాలనీల్లో నీటిముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే పలురూపాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నగరంలో నీటి ముంపు సమస్యపై పట్టణ పౌర సంక్షేమ వేదిక ఆధ్వర్యాన నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నీటి ముంపు సమస్య ఎదుర్కొంటున్న అన్ని కాలనీల్లో తక్షణమే మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, వాటిని ప్రధాన కాలువలకు కలపాలని కోరారు. నగరంలో రిజర్వుడ్ స్థలాలు, ఖాళీ స్థలాల్లో ఉన్న మురుగునీటిని తక్షణమే బయటకు పంపే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో ప్రధాన కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించి, మురుగునీరు దిగువకు పారేలా కాలువ లోతు, వెడల్పు చేయాలన్నారు. అన్ని కాలనీల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, బ్లీచింగ్ చల్లడంతో పాటు ఫాగింగ్ మిషన్ల ద్వారా దోమల మందు పిచికారీ చేయాలన్నారు. వర్షానికి పాడైన రోడ్లను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని కాలనీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. నగర కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు వేగవంతం చేయాలని కోరారు. నగర సమస్యలపై కలెక్టర్‌కు సోమవారం సామూహిక రాయబారం ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి నగరంలోని 15 కాలనీల నుంచి హాజరయ్యారు.

మాట్లాడుతున్న గోవర్ధనరావు

### నూతన కమిటీ ఎన్నిక

అనంతరం పట్టణ పౌర సంక్షేమ వేదిక నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎం.గోవర్ధనరావు, కమిటీ సభ్యులుగా ఎం.ఆదినారాయణమూర్తి, బి.రామ్మోహన్‌రావు, ఎస్.వెంకట్రావు, కె.శ్రీనివాసుతో పాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

# 27న పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 27న రాష్ట్ర సహకార బ్యాంకు విజయవాడలో నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి పిఎసిఎస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరిబుచ్చి రంగనాథ్, జిల్లా అధ్యక్షులు లోలుగు మోహనరావు, ప్రధాన కార్యదర్శి బి.రామారావు పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతామని తెలిపారు. జిఒ నంబరు 36 ప్రకారం హెచ్‌ఆర్ పాలసీ వెంటనే అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2019, 2024లో చేయాల్సిన వేతన సవరణ చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలన్నారు. సహకార సంఘాల ఉద్యోగులకు గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలని, రెండు లక్షల సీలింగ్ రద్దు చేయాలని కోరారు. 2019 తర్వాత సంఘాల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, డిసిసిబికి పిఎసిఎస్‌లు కట్టిన షేరుధనంపై ఆరు శాతం తక్కువ కాకుండా డివిడెంట్ లేదా వడ్డీ 2011 నుంచి చెల్లింపులు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకూ రైతు సంఘాలతో కలిసి పోరాటం చేస్తామన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

# పనులు ప్రారంభించకపోతే రద్దు

- 'జల జీవన్' పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జల జీవన్ మిషన్ (జెజెఎం) కింద చేపట్టిన పనుల్లో అగ్రిమెంట్ పూర్తయినా, ఇంతవరకు ప్రారంభించని కాంట్రాక్టులను రద్దు చేస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. జెజెఎం పనులపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. వెంటనే పనులు ప్రారంభించకపోతే, ఆ కాంట్రాక్టులను రద్దు చేసి రీ టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే ప్రాధాన్యత కలిగిన ఈ పథకంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించబోమని, ఇదే వారికి చివరి అవకాశమన్నారు. జిల్లాలో మొత్తం 4,87,307 ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికి 2,56,499 కనెక్షన్లు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులోగా పనుల వేగాన్ని గణనీయంగా పెంచకపోతే, సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులన్నీ డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న టెండరు పనుల్లో అగ్రిమెంట్లు చేసుకోని వాటి ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, లేకుంటే వాటినీ రద్దు చేయాల్సి ఉంటుందన్నారు. టెండర్లు, అగ్రిమెంట్ల దశలో ఉన్న పనులన్నీ వేగంగా ప్రారంభమైతేనే, నిర్ణీత గడువైన వచ్చే ఏడాది మార్చి లోపు హర్ ఘర్ జల్ పేరిట మరో 178 గ్రామాలను డిక్లేర్ చేయాలన్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు తాళం వేసిన అధికారులు

## రవీంద్రభారతి పాఠశాల సీజ్

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలో వరదవారి వీధిలోని రవీంద్ర భారతి పాఠశాలను విశాఖపట్నం ఇఎస్ఐ అధికారులు బుధవారం సీజ్ చేశారు. కొంతకాలంగా పాఠశాల యాజమాన్యం సుమారు రూ.30 లక్షల ఇఎస్ఐ బకాయిలు చెల్లించకపోవడంతో నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఈ చర్య చేపట్టారు. ఇఎస్ఐ అధికారులు పాఠశాల ప్రాంగణానికి చేరుకుని విద్యార్థులను బయటకు పంపించి ప్రధాన ద్వారానికి తాళం వేసి సీజ్ చేశారు. అనంతరం పాఠశాల గోడలపై నోటీసులు అంటించారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో సహా సుమారు 250 మంది విద్యార్థులు భవిష్యత్ ఏమిటని వారు ఇఎస్ఐ అధికారులను ప్రశ్నించారు. పాఠశాల యాజమాన్యం బకాయిలను చెల్లించకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేయడమైందని వారు తెలిపారు. విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని బకాయిలు చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి పాఠశాలను తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదే విషయమై రవీంద్ర భారతి పాఠశాల ప్రిన్సిపాల్‌ను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా తమకేమీ సమాచారం లేదని తెలిపారు.

# పోలీస్‌స్టేషన్లలో 'ఓపెన్ హౌస్'

**శ్రీకాకుళం సిటీ:** పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు పోలీస్ శాఖ అందిస్తున్న విధులు, సేవలు, ఆధునిక సాంకేతికత వినియోగం, నేర నివారణ చర్యలు, రికార్డుల నిర్వహణ, ప్రజా భద్రతకు తీసుకుంటున్న కృషి వంటి అంశాలను వివరించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఆయుధాలు, ట్రాఫిక్ పరికరాలు, నియమాలు, సైబర్ క్రైమ్ అవగాహన ఆయుధ పరికరాలు తదితర ప్రదర్శనలను వీక్షించారు. విద్యార్థులకు పోలీస్ అధికారులు భద్రతా సూచనలు, సలహాలు అందించారు. పోలీసు సిబ్బంది ఉపయోగించే సాంకేతికత పరికరాలు, ఆయుధాలు, వైర్‌లెస్ సెట్ కమ్యూనికేషన్, బాంబు డిస్పోజల్ సామగ్రి, పలురకాల ఆయుధాలు, పోలీసు జాగిలాల పనితీరు, డ్రోన్స్ వినియోగం, బాడీవార్న్ కెమెరాలు, బ్రీత్ ఎనలైజర్స్, పేలుడు పదార్థాల గుర్తింపు, సిగ్నల్స్, స్పీడ్ గన్, గ్యాస్ గన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. స్టేషన్లో ఉన్న రిసెప్షన్, విశ్రాంతి, కంప్యూటర్ గదులు, ప్రాపర్టీ, లాకప్ రూమ్‌ల గురించి తెలియజేస్తూ నేరం జరిగిన వెంటనే ప్రథమ సమాచార నివేదిక నమోదు, ఇతర దర్యాప్తు అంశాలపై విద్యార్థులకు పోలీసులు వివరించారు. ఈనెల 31వ తేదీ వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



విధులపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# రూ.2,928.90 కోట్లతో సూక్ష్మరుణ ప్రణాళిక

**డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్**

**పొందూరు:** జిల్లాలో డ్వాక్రా గ్రూపు సంఘాలకు 2025-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,928.90 కోట్లతో సూక్ష్మ రుణ ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) పథక సంచాలకులు పి.కిరణ్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు కార్యాలయంలో సూక్ష్మ రుణ ప్రణాళిక లక్ష్యంపై సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సూక్ష్మ రుణ ప్రణాళిక లక్ష్యాన్ని పూర్తి చేయడానికి మండలాల్లో విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. లక్ష్యంలో భాగంగా బ్యాంకుల ద్వారా ఇప్పటికే రూ.2,350 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రణాళికలో రూ.1,830 కోట్లు వ్యవసాయ అనుబంధ రుణాలు, మత్స్య విభాగానికి రూ.123 కోట్లు, ఉద్యాన రంగానికి రూ. 27 కోట్లు, పశుసంవర్ధక విభాగానికి రూ.347 కోట్లు, సెరీకల్చర్ విభాగ రుణాలు రూ.కోటి అందించడం లక్ష్యమన్నారు. నాన్ అగ్రికల్చర్ విభాగంలో రూ.40 కోట్లు మ్యానుఫ్యాక్చరింగ్ రుణాలు, సేవారంగానికి రూ.200 కోట్లు ట్రేడింగ్ రంగంలో డ్వాక్రా మహిళలకు రూ.208 కోట్లు రుణాలు అందించడం లక్ష్యమని వివరించారు. పొందూరు మండలంలో డ్వాక్రా మహిళలకు అగ్రికల్చర్ విభాగంలో రూ.70 కోట్లు, ఫిషరీస్‌లో రూ.66 లక్షలు, హార్టికల్చర్‌లో రూ.34 లక్షలు, పశుసంపదలో రూ.6 కోట్లు, సెరీకల్చర్‌లో రూ.6 లక్షల రుణాలు అందించనున్నామని చెప్పారు. సమావేశంలో డిపిఎం మోహనరావు, ఎల్ సి రామచంద్రరావు, ఎపిఎంలు రామ్మూర్తి, జి.శ్యామలరావు, సిసిలు, విఒఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ కుమార్

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

## మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో ఐదు రోజుల పాటు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. అరిణామ్ అల్లివలస వద్ద గల నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ వద్ద జరిగిన యూనియన్ సమావేశంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. దేశంలో వివిధ రంగాల కార్మికులను, సంఘాలను ఐక్యం చేసి బలమైన కార్మిక వర్గ పోరాటాలను నిర్మించేందుకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు దోహదపడతాయన్నారు. కార్మికవర్గం త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ ప్రయోజనాల కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిగంటలను పెంచుతూ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెమ్ యూనియన్ నాయకులు అంబటి సత్యన్నారాయణ, పి.సుధాకర్, కేదారేశ్వరరావు, గణపతి, మాన్యం రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

## కొసమాల రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని కొసమాలలో కార్తీకమాసం సందర్భంగా స్నానాలకు వెళ్లే మహిళలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ రహదారి పూర్తిగా బురదమయమై, రాకపోకలకు అడ్డంకిగా మారింది. దీనిపై స్థానికులు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కలిసి విన్నవించారు. ఈ మేరకు బుధవారం గ్రామానికి వెళ్లి స్వయంగా సమస్యను పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. రోడ్డును తక్షణమే శుభ్రపరచాలని సూచించారు. కార్తీకమాసం సందర్భంగా మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు సంబాన వెంకటరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి బొమ్మ ప్రసాదరావు, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి బైరిసింగి దినకర్, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, కడంబల పైడిరాజు పాల్గొన్నారు.

## 'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

అరుణ్‌కుమార్

టెక్కలి ఐతమ్ కళాశాల బిఎస్ అండ్ హెచ్ విభాగ గణిత అధ్యాపకులు డాక్టర్ అరుణ్‌కుమార్ సరివిల్లికి గీతం విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ వచ్చిందని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ స్కూల్ ఆఫ్ సైన్స్, మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో పిహెచ్‌డి ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నానికి చెందిన అర్బన్-ఇండస్ట్రియల్ రీజియన్‌లో 'ఫ్లెక్సిబుల్ ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్‌లను ఉపయోగించి వాయు కాలుష్య సాంద్రతలపై గణాంక నమూనాలతో పరిశోధనలు చేపట్టారని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో వాయు కాలుష్య నియంత్రణకు గణాంక మోడల్స్ ఆధారిత పరిశోధనలు, సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బిఎస్ అండ్ హెచ్ భాగాధిపతులు డాక్టర్ రమణయ్య, డాక్టర్ రత్నమణి అరుణ్ కుమార్‌ను అభినందించారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శిరీష

## సమస్యల పరిష్కారానికి కృషి

**పలాస:** పలాస నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నానని చెప్పారు. రైల్వే వంతెన పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. కేంద్రీయ విద్యాలయం మంజూరులో కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి ఎంతో ఉందన్నారు. పలాసలో రైతు బజార్ ఏర్పాటు చేసి రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తనకు వచ్చిన ప్రతి ఫిర్యాదునూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

## వనభోజనాల సమయంలో అప్రమత్తం

రమేష్‌కుమార్, మెరైన్ సిఐ

**సోంపేట:** కార్తీకమాసం వనభోజనాలను పురస్కరించుకొని పిక్నిక్ స్పాట్‌గా సముద్ర తీరానికి వస్తూ ఉంటారని, ఆ మేరకు సముద్ర స్నానాలు చేయకుండా వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని బారువ మెరైన్ సిఐ వి.రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరులతో మాట్లాడారు. బారువ మెరైన్ పరిధిలో ఇచ్ఛాపురం, బారువ, రట్టి బీచ్‌ల్లో బందోబస్తు ఏర్పాటుకు ప్రణాళిక వేశామన్నారు. మెగా ఫోన్ ద్వారా సందర్శకులకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా సందర్శకులు మద్యం సేవించి సముద్ర స్నానాలు చేయరాదని, సెల్ఫీల దృష్టిలో ఉండి అలలతో వచ్చిన పిల్లలపై జాగ్రత్తలు వహించాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తూ క్షేమంగా, సురక్షితంగా వచ్చిన వారందరూ వారివారి ఇళ్లకు క్షేమంగా చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## రామారావు ఔదార్యం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన దూగాన రామ్మూర్తి, ప్రణయ్ ఈ నెల 16న సంభవించిన రోడ్డు ప్రమాదంలో తీవ్రమైన గాయాల పాలయ్యారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరిలో ప్రణయ్ కోలుకొని ఇంటికి చేరాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పొందర రామారావు, పాండవ చంద్రశేఖర్ పరామర్శించి తమ మిత్రులు మద్దెల విజయ్, మద్దెల కృష్ణ, రవితేజ్ కలిసి రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, త్వరగా సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

# పోలీసు విధులపై అవగాహన

నరసన్నపేట : అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**ఆమదాలవలస:** పోలీస్ శాఖ కార్యకలాపాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓపెన్ హౌస్ కార్యక్రమం ఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే రికార్డులు, అధికారుల విధులు, ఆయుధాలపై అధికారులు వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ శ్రీనివాసరావు, ఎఎస్ఐ ఝాన్సీభాయ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**సోంపేట:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లవరాజు పోలీస్ విధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎఫ్ఐఆర్, నేర లక్షణాలు, చట్టాల అమలు ఇతర విధులను గురించి తెలియజేశారు. సంస్కార భారతి విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లవరాజు

**సంతబొమ్మాళి:** పోలీస్ స్మారక వారోత్సవం సందర్భంగా దండుగోపాలపురం ఉన్నత పాఠశాలలో బుధవారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పోలీస్ అమరవీరులు హెడ్ కానిస్టేబుల్ పి.లక్ష్మణరావు, పి.కృష్ణారావు సేవలను స్మరించారు. 5వ బెటాలియన్ ఎపిఎస్‌పికి చెందిన రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, ఆర్ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొని నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిట్ట గంగన్న మాట్లాడుతూ అమరవీరులు పాఠశాలకు గౌరవాన్ని తెచ్చారని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సి.ఆర్.పి.గిరి పాల్గొన్నారు.

**నరసన్నపేట:** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక సంపత్ సాయి కళాశాల ఇంటర్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో ఉండే అధికారులు, వారి విధులు, విహెచ్ఎఫ్ సెట్‌లో మాట్లాడటం, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం, కోర్టు విధులు, రిసెప్షన్, కంప్యూటర్ ఆపరేటర్ పనితీరు, లాకప్ రూము, ఫిర్యాదులు ఇస్తేటప్పుడు గౌరవించే పద్ధతులపై తెలియజేశారు. ట్రైనీ ఎస్ఐ ప్రమీలా దేవి, ఎఎస్ఐ-2 శేఖరరావు, ఎఎస్ఐ శంకరరావు పాల్గొన్నారు.

లావేరు : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

**లావేరు:** యువత మాదకద్రవ్యాలకు బానిసకావడం వల్ల జీవితాలు నాశనమైపోతాయని లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావు అన్నారు. లావేరు పోలీస్‌స్టేషన్లో బుధవారం జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. నిర్వహణ, నేరాలు నియంత్రణ ట్రాఫిక్ నిబంధనలు, దొంగతనాల్లో శిక్షలు, శాంతి భద్రతలు పరిరక్షణపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంతరావు, సూర్యనాగరాజు పాల్గొన్నారు.

## 28న జాబ్ మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంకు చెందిన కోహన్స్ ఫార్మా, హైదరాబాద్‌కు చెందిన అరబిందో, హెటేరో డ్రగ్స్ ఈ జాబ్‌మేళా నిర్వహిస్తాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు విశాఖపట్నంలో నైపుణ్య అభివృద్ధి కేంద్రంలో 60 నుంచి 90 రోజుల మధ్య శిక్షణ ఇచ్చి అనంతరం ఉద్యోగాల్లో పరిశ్రమలు చేర్చుకుంటాయని తెలిపారు. ప్రారంభంలో రూ.15 వేలు నుంచి రూ.18 వేలు వరకు వేతనం ఉంటుందన్నారు. 25 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులుగా చెప్పారు. హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు 8688003060, 8688156216 నంబర్లను సంప్రదించాలన్నారు.

## నేడు ఇంటింటా కుళాయిలు ప్రారంభం

**బూర్జ:** మండల కేంద్రంలో గురువారం జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కొళాయిల పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొంటారని, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల నాయకులు కోరారు.

## విద్యార్థుల్లో నైపుణ్యం అవసరం

**టెక్కలి:** విద్యార్థి దశ నుంచే నైపుణ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాట్ల దాశరథి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా 9 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఫ్లెక్సీ తయారీ విధానంపై బుధవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఫ్లెక్సీ విధానం, రూపకల్పన, తయారీ, యంత్రం, జపాన్ టెక్నాలజీ విధానం ప్రింటింగ్ విడిభాగాలు తదితరవి ప్రాక్టికల్‌గా చూపించి అవగాహన కల్పించారు. చదువుతోపాటు ఉపాధి మార్గాన్నీ అన్వేషించుకోవాలని సూచించారు. ఒకేషనల్ ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాసరావు, జగన్నాథ్, కె.కె.రామరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రెషర్స్ డే

**నరసన్నపేట:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.లత ఆధ్వర్యాన బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సంతోషకరమైన వాతావరణంలో ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారుర. మీ ద్వారా తల్లి దండ్రులు గర్వించేలా సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం సినీ గేయాలకు నృత్యాలు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

## కొమరం భీమ్ జయంతి

**టెక్కలి :** స్థానిక ఆర్‌టిసి డిపోలో కొమరం భీమ్ 124వ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు బి.డి.రావు మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం తమ జీవితాన్ని అర్పించిన కొమరం భీమ్ స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.డి.జె.రావు, ఎల్.టి.రావు, వి.కె.దేవ్, ఆర్.పి.రావు, ఎస్.ఆర్.కుమార్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'క్విస్కిక్ ఫాల్ ఫెస్ట్'

**ఎచ్చెర్ల:** రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయంలో జరుగుతున్న క్విస్కిక్ ఫాల్ ఉత్సవం 2025 రెండవ రోజు బుధవారం క్వాంటమ్ కంప్యూటింగ్, క్విస్కిట్ నూతన ఆవిష్కరణలకు వేదికైంది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలు విద్యార్థులు, అధ్యాపకులను గణన భవిష్యత్‌ను రూపొందించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలను అన్వేషించేందుకు దోహదపడ్డాయి. ఆస్ట్రేలియాలోని బాండ్ విశ్వవిద్యాలయం సొసైటీ అండ్ డిజైన్ ఫ్యాకల్టీ సహ ఆచార్యులు గ్రెగొరీజె.స్కుల్మోస్కీ ఆన్‌లైన్‌లో అతిథి ఉపన్యాసం ఇచ్చారు. క్వాంటమ్ పురోగతిని నడిపించడంలో సాంకేతిక నిపుణులు, ప్రాజెక్టు నాయకుల మధ్య సహకారం ప్రాముఖ్యతను చెప్పారు. అనంతరం కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ)కు చెందిన క్రిప్టాలజిస్ట్, సమాచార సిద్ధాంత నిపుణులు డాక్టర్ గౌతమ్ పాల్ ఆన్‌లైన్ ద్వారా క్వాంటమ్ క్రిప్టోగ్రఫీలో వస్తున్న కొత్త అంశాలు, సమాచార భద్రతపై వాటి ప్రభావంపై ఉత్తేజకరమైన చర్చా గోష్ఠి నిర్వహించారు. క్వాంటమ్ మెషీన్ లెర్నింగ్ పరిశోధకుడు డాక్టర్ జ్ఞాన్ యల్లా క్విస్కిట్‌పై ఆచరణాత్మక కార్యగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సంచాలకులు ప్రొఫెసర్ బాలాజీ, పరిపాలన అధికారి డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి డాక్టర్ వాసు, సమన్వయకర్తలు డాక్టర్ రవి గేదెల, రమేష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులకు నిధుల మంజూరు

**సంతబొమ్మాళి :** ఆర్‌వి రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తు కోసం రూ.45 లక్షలు మంజూరయ్యాయని సాధన కమిటీ చైర్మన్ కోత మధుసూదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సాధన కమిటీ టెక్కలి ఆర్‌డిఒ వినతిపత్రం అందజేశామన్నారు. దీంతో నిధులు మంజూరుయ్యాయని పేర్కొన్నారు. వర్షం కారణంగా వారం రోజుల్లో వెట్‌మిక్స్ ద్వారా పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారని అన్నారు. వడితాండ్ర, రావివలస, నౌపడ రోడ్ల నిర్మాణాలకు రూ.18 కోట్లు ప్రతిపాదించినట్లు చెప్పారు. త్వరితగతిన స్పందించిన టెక్కలి ఆర్‌డిఒ, రోడ్లు, భవనాల అధికారులకు సాధన కమిటీ, స్థానిక ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## బస్సులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

గ్రామీణ ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సులను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక అర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారవాణా సౌకర్యాల లేమితో గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొత్తూరు-గొట్టిపల్లి, పూతికవలస-హడ్డుబంగి, ఆర్.కె.పురం-అంగూరు, కొత్తూరు-పాతపట్నం, కొత్తూరు-టెక్కలి, కొత్తూరు-హడ్డుబంగి, కొత్తూరు-కడుము, కొత్తూరు-పొన్నుటూరు, కొత్తూరు-దిమిలి మార్గాల్లో బస్సు సర్వీసులు ఉండేవని గుర్తు చేశారు. అయితే తరువాత కాలంలో ఈ మార్గాల్లో సర్వీసులు రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న ప్రభుత్వం ఈ పాత బస్సు మార్గాలను మళ్లీ ప్రారంభిస్తే మహిలలకు మరింత ఉపయోగం కలుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పల్లెవెలుగు బస్సులు పునరుద్ధరించడం అత్యవసరమని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, దుర్గారావు, జమ్మయ్య, రమేష్, గణపతి, రాములు, తెల్లన్న, సిఐటియు నాయకులు పనస రమేష్, సూర్య నారాయణ, వసంతరావు, రమేష్, రవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

## పన్నులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ అభివృద్ధి పట్టణ ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆర్థికంగా బలపడాలంటే ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు. ఆర్థిక ఇబ్బందుల నడుమ కూడా పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మున్సిపల్ ప్రాంతాల స్థలాల క్రమబద్ధీకరణకు ఆర్థిక వెసులుబాటుతో కూడిన కొత్త విధానాలు రూపొందించిందని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు, లేఅవుట్లు వేసిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ప్లాన్ అనుమతులు పొందడం కష్టంగా ఉండేదని, ఇప్పుడు పది అడుగుల రహదారి ఉన్నా కూడా ప్లాన్ అప్రూవల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు మున్సిపల్ నిబంధనలను పాటించి అనుమతులు పొంది నిర్మాణాలు చేపడితే భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. ఇప్పటికే మున్సిపల్ పరిధిలో మూడు అక్రమ లేఅవుట్లు గుర్తించామన్నారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై మున్సిపల్ శాఖ కఠినచర్యలు తీసుకుంటుందని, అటువంటి ప్రాంతాలకు మున్సిపల్ సేవలు నిలిపి వేయబడతాయన్నారు. లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాల కోసం ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పట్టణ ప్రజలు పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు వంటి సేవలు సక్రమంగా పొందాలంటే పన్నులు చెల్లించడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ఆర్థిక పరిపుష్టికి ప్రతి ఒక్క పౌరుడు సహకరించాలని ఎమ్మెల్యే రవికుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లీశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ శిమ్మ మాధవి, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, పివికె రాజు, టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో రక్తం కొరతను అధిగమించేందుకు, ముఖ్యంగా తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న వారికి సహాయం అందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా హెడ్ పోస్ట్ మాస్టర్ పి.రంగబాబు మాట్లాడుతూ తలసేమియా, ట్రామాకేర్, డయాలసిస్ బాధితుల ప్రాణాలు నిలపడానికి ఈ రక్తం ఉపయోగ పడుతుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలను తమ శాఖ తరఫున మరెన్నో చేపడుతామని తెలిపారు. జిల్లా సూపరిండెంట్ వి.హరిబాబు తపాల శాఖ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పోస్టల్ శాఖ సిబ్బందితో పాటు సుమారు 20 మంది స్వచ్ఛందంగా

రక్తదానం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత రోజురోజుకీ పెరుగుతుందని, ప్రాణ నష్టాన్ని తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. రక్త దాతలను, నిర్వాహకులకు సర్టిఫికెట్లు, గోల్డ్ ప్లేటెడ్ మెడల్స్‌తో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి. చైతన్యకుమార్, జి.రమణ, ఎ.విశ్వేశ్వరరావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆత్మనిర్భర భారత్ సాధన దిశగా ప్రతిఒక్కరూ పాటుపడాలని ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు కోరారు. మండలంలోని నగరంపల్లి హైస్కూల్‌లో టిసిఎస్ కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యాన విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. టాటా బిల్డింగ్ ఇండియాలో భాగంగా స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించడానికి 'నేను చేసే ఐదు పనులు' అనే అంశంపై విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో ఎస్.నవదీప్, ఎన్.రిషిత్, టి.శ్రావణ్, జూనియర్ విభాగంలో డి.జ్యోతి, బి.హర్షవర్ధన్, హెచ్.గౌతమ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, టిసిఎస్ సభ్యులు భుజంగరావు, రవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం :** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నవంబరు 26 జాతీయ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సూర్యారావు, స్కూల్ కమిటీ చైర్మన్, కో-ఆప్షన్ సభ్యులు గౌరీశంకర్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, గీతారాణి, సూర్యనారాయణ, నాగరాజు, జోగేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : వ్యాసరచన పోటీలు పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం

# ఆదిత్యుని ఆలయంలో సిబ్బంది లేక ఇబ్బంది

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రసిద్ధి చెందిన ఆదిత్యుని ఆలయంలో ఆదాయం ఘనంగా వస్తున్నా కొన్నేళ్లుగా రెగ్యులర్ సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో ఇష్టారాజ్యంగా ఎవరికి వారే యమునా తీరేలా అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న వైనం. డిసి క్యాడర్ ఉన్న అతి పెద్ద ఆలయానికి ఎప్పటినుంచో తాత్కాలిక రోజువారి వేతన సిబ్బందితోనే ఆలయ పరిపాలన నిర్వహిస్తున్నారు. ఆలయానికి కనీసం 40 మంది సిబ్బంది అవసరం ఉండగా ప్రస్తుతం ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు స్వీపర్లు, ఇద్దరు అటెండర్లు మాత్రమే పనిచేస్తుండటం విశేషం. కేశఖండనశాలలో శాశ్వత ఉద్యోగులు లేరు. అన్నదాన, ప్రసాదాలు తయారు చేసిన చోట కూడా శాశ్వత ఉద్యోగులు లేక ఔట్సోర్సింగ్ ఉద్యోగులతోనే విధులు నిర్వహిస్తుండడంతో అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వారికిచ్చిన చిన్న మొత్తం జీతాలు కూడా నెలనెలా అందించడం లేదని, గత ఫిబ్రవరి నెల నుంచి వారికి జీతాలు లేవని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకంలో కూటమి పాలకులు ఎవరికి చెబితే వారికి ఆ పోస్టుల్లో భర్తీ చేయకపోతే వారివలన ఇబ్బందులు ఉంటాయని ఆలయ అధికారులు నిమ్మకుండి పోతున్నారు. ఆ విధంగా వచ్చిన ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు వారిపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రతి ఆదివారం రద్దీగా ఆదిత్యుని ఆలయం ఉంటుంది. అయితే ప్రతి ఆదివారం కనీసం 50 లేక 100 మంది వరకు సేవకులు అవసరం ఉంటుంది. అనేక జిల్లాల నుంచి 200 మంది దాటి సేవకులు రావడం, యాత్రికుల కంటే సేవకులే ఎక్కువ మంది రావడం, ప్రసాదాలు, అన్నదాన ప్రసాదాలు వీరివలన ఎక్కువ దుర్వినియోగం అవుతుందని కొందరి అభిప్రాయం. ఇటీవల అమావాస్య రోజు కనీసం భక్తులు లేకపోయినా ఉదయం 10 గంటలలోపే ప్రసాదాలు అయిపోయాయని సిబ్బంది చెప్పడం విడ్డూరంగా ఉందని కొంత మంది యాత్రికులు ఆవేదన చెందుతున్నారు. సేవకులు కనీసం నెల, రెండు నెలల ముందు ఆలయ సిబ్బంది పర్మిషన్ తీసుకొని, అనుమతి లభించిన తరువాత రావాల్సిన పరిస్థితి ఉన్నా, అలా కాకుండా ఇష్టారాజ్యంగా సేవకులు వస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అన్న ప్రసాద కేంద్రం వద్ద కూర్చున్న సేవకులు

స్థానికులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

## జగనన్న లేఅవుట్ పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలిలో ఉన్న జగనన్న లేఅవుట్ కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రహదారి పరిస్థితిని స్వయంగా పరిశీలించేందుకు బుధవారం ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా గ్రామానికి వెళ్లారు. స్థానికులతో మాట్లాడారు. రోడ్డు మధ్య భాగంలో బురదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు అక్కడ కల్వర్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత శాఖలకు నివేదిక పంపేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఈ చర్యలు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాలతో ప్రారంభమయ్యాయి. రోడ్డు సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను పరిశీలించి తగిన నివేదిక ఇవ్వాలని ఎంపిడిఒను ఆదేశించారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అధికారులు సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలతి ఢిల్లీరావు, లక్ష్మీనారాయణ, సచివాలయ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

## పశు సంరక్షణకు కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని పశు సంరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కిల్లిపాలెంలో బుధవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పశువుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిఒక్కరూ పశువులకు అంటురోగాలు సోకకుండా తప్పకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. దూడల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన లేగదూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఎడి ఎం.బాలకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు ఎం. శ్రీనివాసరావు, రమణ, పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మాన గ్రహీతలతో ఉపాధ్యాయులు

## మీ సేవలు మరువలేం

**కవిటి:** రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని ప్రధానోపాధ్యాయుడు శివరాం ప్రసాద్ పాడి అన్నారు. మండలంలోని రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఏడుగురు ఉపాధ్యాయులను బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంపా రవికుమార్, నర్తు అనిల్‌కుమార్, బాలక శ్రీనివాసరావు, ఉమాకాంత్ మహంతి, అప్పల నాయుడు, దున్న పద్మావతి, చుక్కా లీలావతిని సిబ్బంది సత్కరించారు. విద్యాసంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వారి సేవలను ప్రశంసించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## యాజమాన్య పద్ధతులపై శిక్షణ

**పోలాకి:** మండలంలోని గొల్లలవలసలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యాన ఖరీఫ్-25 సీజన్‌లో వరి పంటలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులు, రబీ సీజన్‌లో అపరాల గురించి బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి పంటలోని ఎరువులు, పురుగు, తెగులు యాజమాన్యం గురించి వివరించారు. సాగు సమస్యలకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిష్కారం మార్గాలు తెలిపారు. వరిలో దోమపోటు ఉధృతి లేకుండా చేసేందుకు కాలిబాటలు అవశ్యకత, అవసరం మేరకు పురుగు మందులు వాడాలని సూచించారు. వరిలో పొటాష్‌ను రెండుసార్లు తప్పని సరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్లు కె.భాగ్యలక్ష్మి, రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయబాబు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్, ఎఒ పి.చిరంజీవి పాల్గొన్నారు.

## సురక్ష యాప్‌తో మద్యం నాణ్యత తనిఖీ

**ఆమదాలవలస:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మద్యం నాణ్యత తనిఖీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, వినియోగదారులు కొనుగోలు చేసిన మద్యం ప్రభుత్వం సరఫరా చేసినదేనా కాదా అనే విషయాన్ని సులభంగా తెలుసుకునేలా 'ఏపి ఎక్సైజ్ సురక్ష' పేరుతో మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల ప్రజలకు ఈ యాప్ ద్వారా మద్యం నాణ్యతను నిర్ధారించుకునే అవకాశం ఉందన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. లిక్కర్ నాణ్యత లేదా చట్టవిరుద్ధ విక్రయాలపై ఫిర్యాదులు చేయాలనుకుంటే 14405 నంబర్ ద్వారా తెలియ జేయవచ్చన్నారు.

## సకాలంలో పనులు పూర్తి చేయాలి

**శ్రీకాకుళం సిటీ:** సకాలంలో కలెక్టరేట్ సమగ్ర ఆర్థిక భవన సముదాయం పనులు పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న సమగ్ర ఆర్థిక భవన సముదాయం పనులను బుధవారం పరిశీలించారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ సిబ్బందిలో ప్రస్తుత పనుల పరిస్థితిపై చర్చించారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. భవనం పూర్తయితే జిల్లా అధికారులు మొత్తం ఒకే కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. మాస్టర్ ప్లాన్‌కు లోబడి భవనం పూర్తిచేయాలని చెప్పారు.

## ఈ-పంట నమోదు పరిశీలన

**కోటబొమ్మాళి:** మండలంలోని పెద్దబమ్మిడి గ్రామ సచివాలయ పరిధిలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని టెక్కలి వ్యవసాయ సంక్షేమ సంచాలకులు కె.జగన్మోహనరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 91,847 ఎకరాల్లో ఈ పంట నమోదు లక్ష్యమని అన్నారు. ఇప్పటివరకు 83,315 ఎకరాల నమోదు పూర్తయిందన్నారు. మిగిలిన 8,532 ఎకరాల ఈ పంట నమోదు కూడా ఈ నెల 30 లోగా రైతులు రులు తమ 1బి, ఆధార్ కార్డులను రైతు సేవా కేంద్రాల్లో అందించి, గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గోవిందరావు, విఎఎ మాధవి పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీలో సమయపాలన

**లావేరు:** రేషన్ పంపిణీలో డీలర్లు కచ్చితంగా సమయపాలన పాటించాలని తహశీల్దార్ జి.ఎల్.ఈ.శ్రీనివాసరావు ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాల న్నారు. కార్డుదారులతో గౌరవంగా మెలగాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులు సకాలంలో అందించాలని ఆదేశించారు. మండలంలోని ఇంకా 15 వందల స్మార్ట్ కార్డులు పంపిణీ చేయాలి చేయాల్సి ఉందని, వాటిని త్వరితగతిన పంపిణీ చేయాలని సూచించారు. పౌర సరఫరాల ఉప తహశీల్దార్ అరుణ, గోదాం ఇన్‌ఛార్జి నానిబాబు పాల్గొన్నారు.

మాట్లాతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

# తేనెటీగల పెంపకంపై శిక్షణ

మాట్లాడుతున్న నాబార్డు డిడిఎం రమేష్‌కృష్ణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతిలో అభివృద్ధి పరిచేందుకు మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. నాబార్డ్ డిడియం కె.రమేష్ కృష్ణ, డిఆర్‌డిఎ డిపిఒ బి.నారాయణరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తేనెటీగల పెంపకం ద్వారా రైతులు, మహిళలు, యువత ఆర్థికంగా లాభపడే అవకాశం ఉందని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారు తేనెటీగల పెంపకాన్ని వృత్తిగా స్వీకరించి పరిశ్రమలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నాబార్డ్ డిడియం రమేష్ కష్ణ మాట్లాడుతూ తేనెటీగల పెంపకాన్ని వ్యాపార రంగంగా అభివృద్ధి చేసుకోవాలనుకునే వారికి నాబార్డ్ నుంచి తగిన ఆర్థిక సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. డిఆర్‌డిఎ డిపిఒ నారాయణరావు మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష తేనెటీగల సంరక్షణ, వ్యాధుల నివారణ, శాస్త్రీయ మెలకువలపై వివరించారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ జి.ఎస్.రాయ్, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై పోరాటం

నినాదాలు చేస్తున్న నాయకులు

**ఇచ్ఛాపురం:** విద్యా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు విరాజ్ దేవాంగ్ అన్నారు. రాష్ట్రశాఖ ఆధ్వర్యాన విద్యార్థి సంస్థలపై బుధవారం నిర్వహించిన బస్సుజాత కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో చాలాచోట్ల కళాశాలల్లో సరైన బోధన సిబ్బంది లేరని అన్నారు. విద్యా వ్యవస్థ పటిష్టం చేస్తామని చెప్పుకునే ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేవలం నాలుగు శాతం మాత్రమే కేటాయింపులు చేస్తుండడం విచారకరమని అన్నారు. విద్య ప్రైవేట్ వ్యాపారులకు వరంగా మారిందని అన్నారు. విద్యార్థుల సమస్యలపై తాము బస్సు యాత్ర ప్రారంభిస్తే కొన్ని ప్రత్యేక కారణాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని అన్నారు. అయినా విద్యా వ్యవస్థలో మార్పులు, విద్యార్థుల సమస్యలపై తమ పోరాటాన్ని సాగించి బస్సు యాత్రను చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జి.సహాయ కార్యదర్శులు కొలాయిస్వామి, మస్తాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవి, సోమేశ్‌సాయి, లోకనాథం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, ఆర్యలమ్మ లండ వెంకటరావు, జిల్లా సమితి సభ్యులు చాపల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గొప్పిలిలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం పర్యటించారు. గొప్పిలికి చెందిన మాలతి ఢిల్లీరావు భార్య మోహిని ఇటీవల అనారోగ్యం గురికావడంతో ఆమెను పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన మాడుగుల వెంకటరమణ అనారోగ్యం గురికావడంతో ఆయననూ పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతోపాటు పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, సర్పంచ్ రవ్వల గణపతిరావు, బొచ్చు ప్రసాదరావు, జాడిపల్లి ఎంపిటిసి కదంబల సుజాత, పైడిరాజు, టిడిపి మండల కార్యదర్శి ఎల్.వాసు, పడాల శ్రీను ఉన్నారు.

**'కలమట'**

మండలంలోని కొసమాలకు చెందిన మాజీ సర్పంచ్ అంకడాల లోకనాథం, ఎస్.సుబ్బారావు మాస్టర్‌లు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ బుధవారం పరామర్శి ంచారు. అలాగే గొప్పిలికి చెందిన టిడిపి నాయకులు మాలతి ఢిల్లీరావు భార్య మోహిని ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమెనూ పరామర్శించారు. రాయికోలకు చెందిన టిడిపి నాయకులు సవర సుంకన్న ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులనూ పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో ఎంపిటిసి మాజీ సభ్యులు కె.తిరుపతిరావు,

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

మాజీ సర్పంచ్‌లు సంతోష్, జన్ని రామకృష్ణ, ఉర్లాన వసంత్, ఎల్లంనాయుడు ఉన్నారు.

**పోలాకి :** మండలంలోని దీర్ఘాశి పంచాయతీ కింజరాపువానిపేటలో కింజరాపు రామ్మూర్తి మాష్టారు భార్య, రాళ్లపాడుకు చెందిన బోర నీలంలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ సర్పంచ్ పల్లి ఝాన్సీరాణి, బోర రవి, పూడి కూర్మారావు పాల్గొన్నారు.

**ఆమదాలవలస:** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం పరామర్శించారు. అన్నాజీరావు తల్లి సనపల రత్నాలమ్మ ఇటీవల అనారోగ్య ంతో మృతి చెందడంతో కొర్లకోటలో నిర్వహించిన రత్నాలమ్మ సంస్మరణ సభలో ఎమ్మెల్యే పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. టిడిపి నాయకులు, సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

**కవిటి:** మండలంలోని బొరివంక, మాణిక్యపురం 11కెవి, 11కెవి ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్లలో ఆర్‌డిఎస్ఎస్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున బొరివంక సబ్ స్టేషన్ పరిధిలోని బొరివంక, బొగిడియాపుట్టుగ, మునిపుట్టుగ, దూగానపుట్టుగ, తుంగానపుట్టుగ, కొర్రాయిపుట్టుగ గ్రామాలకు, మాణిక్యపురం, బల్లిపుట్టుగ, వరక, కుసుంపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

**నరసన్నపేట :** ఈ నెల 24న 33/11 కెవి ఉర్లాం విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు పనులు చేపట్టనున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

**ఆమదాలవలస:** 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఫీడర్‌పై నిర్వహణ పనులు చేపడుతున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా సొట్టవానిపేట, అక్కివలస, పంతులుపేట, టిజిఆర్ నగర్, సప్తపురాలు, చింతాడ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. నిర్వహణ పనులు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

**పొందూరు:** పొందూరు, తాడివలస విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటెనెన్స్, ఇతర మరమ్మతుల కారణంగా ఈనెల 24న విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎఇ సుధీర్ తెలిపారు. దీంతో పొందూరు, రాపాక, కొంచాడ, తండ్యాం, మలకాం, లైదాం, సిరిపురం, గోకర్ణపల్లి, గోరింట, తాడివలస, గండ్రేడు, లచ్చయ్యపేట, వాల్తేరు తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

సిసి రహదారి నాణ్యత పరిశీలిస్తున్న అధికారులు

## నాణ్యతలో లోపాలుంటే బిల్లులు నిలుపుదల

ప్రజాశక్తి- పొందూరు

సిసి రహదారులు, కాలువలు నిర్మాణాల్లో నాణ్యతా లోపాలుంటే బిల్లులు నిలుపుదలతో పాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందని క్వాలిటీ కంట్రోల్ డిఇఇ రామకృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలో పల్లెపండగ పథకంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్, పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన సిసి రహదారులు, కాలువలను బుధవారం పరిశీలించి నాణ్యతను పరీక్షించారు. ప్రతీ రహదారిని పరిశీలించాకే బిల్లుల మంజూరుకు అనుమతి ఇస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇఇ చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షుడు సిహెచ్ రామ్మోహన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎ.చినరంగ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అర్చన

## గోరువాని చెరువు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట పట్టణంలో సంతతోట దగ్గర ఉన్న గోరువాని చెరువును నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పట్టణ టిడిపి నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ చెరువు అభివృద్ధికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలాగా చేస్తామని హామీ ఇచ్చారు. చెరువును పరిరక్షించి బాధ్యత పట్టణ పౌరులందరూ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, మాజీ సర్పంచ్‌లు గొద్దు చిట్టిబాబు, ఊన్న రాజశ్రీ, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, నేతింటి విశ్వేశ్వరావు, బోయిన సతీష్, చలపాక మల్లి, బోయిన నరసింహమూర్తి, బగ్గు రవి, ఎం.హరి పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న రవికుమార్

## సంతకాల సేకరణ

ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటుకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పిఎల్ దేవీపేట, వావాం, మామిడి వలస, చిన్న లంకాం పంచాయతీల్లో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు అన్యాయం జరిగే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కె.గోవిందరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, నీలాదేవిపురం ఎంపిటిసి నరసింహారావు, సర్పంచ్‌లు జి.మంజు, రామకృష్ణ, ప్రభావతి, మజ్జి రాము తదితరులు పాల్గొన్నారు.